క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి గ్రామానికి చెందిన ఎంఎస్. శ్రీనివాస్ సాగర్(ఎస్ఎస్‌సీ గ్రూప్స్ చైర్మన్) రూ.2లక్షల విరాళం అందజేశారు. గుట్టపైకి వెళ్లే దారిలో సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.2లక్షలతో 620 బస్తాల సిమెంట్, 4 సిమెంట్ పైపులను ఆలయ నిర్వాహకులకు ఆయన అందజేశారు. అదేవిధంగా అచ్చాయపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోయిని చంద్రశేఖర్ సీసీరోడ్డు కోసం 200 బస్తాల సిమెంట్ కోసం రూ.60వేలను విరాళంగా అందజేశారు.

అల్లూరి సీతారామరాజు జయంతి

జడ్చర్ల టౌన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో సంస్కార భారతి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, ఉపాధ్యాయురాలు పద్మలీల, వనజ, సువర్ణలు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

రాజాపూర్: పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొట్ట మొదటిసారి జిల్లా కేంద్రానికి వెళ్తున్న ఎంపీ డీకే అరుణకు గురువారం రాజాపూర్ మండల కేంద్రంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి పత్రం అందజేశారు. నాయకులు నర్సింలు, సూరిగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా జెట్టి రాములు

నవాబుపేట: బీకేఎస్ మండల అధ్యక్షుడిగా కేశవరావుపల్లికి చెందిన జెట్టి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు గజేందర్, రఘునందన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రఘురాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శిగా రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారిగా ప్రతాప్‌రెడ్డితో పాటు మరో 9 మందిని ఎన్నుకున్నట్లు వివరించారు. నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, పండరీనాథ్, వెంకటయ్య, చిన్నస్వామి తదితరులు ఉన్నారు.

కరపత్రం విడుదల

హన్వాడ: హైదరాబాద్‌లో నిర్వహించబోయే రజతోత్సవ వేడుకలకు మాదిగలు, ఉపకులాలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈనెల 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలకు సంబంధించి గురువారం దండోర నాయకులు కరపత్రాన్ని విడుదల చేశారు. కృష్ణ, ఆంజనేయులు, బాలకృష్ణయ్య, చెన్నయ్య, కొండయ్య, సంజీవ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు త్వరలోనే మంచిరోజులు

నవాబుపేట: బీఆర్ఎస్‌కు త్వరలోనే మంచిరోజులు రాబోతున్నాయని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఊరంచుతండాకు చెందిన ఉపసర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్ ఎర్రవల్లిలోని ఫాం హౌస్‌లో ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడారు. ఈమేరకు రాములు నాయక్ కేసీఆర్‌ను ఘనంగా సన్మానించారు.

బదిలీల అనుమతిపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇవ్వడంపై టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కోశాధికారి కృష్ణమోహన్‌లు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు బదిలీల కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నట్లు వివరించారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

నవాబుపేట: కారుకొండ జెడ్పీ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు, టీచర్లు ఘనంగా సన్మానించారు. దశరథ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారావు, రేహమాన్, రాధ, కృష్ణకుమార్, రాఘవేందర్, శ్రీనివాస్‌లకు ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ ఎంపీటీసీ గోపాల్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గ్రూప్స్ ఉద్యోగాలను పెంచాలని, గ్రూప్–1లో 1:100 రేషియో అమలుకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ ముట్టడికి నిరుద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈక్రమంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పీయూ పరిధిలో పలువురు నాయకులను అరెస్టుచేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



వన్‌టౌన్ చౌరస్తాలో రోడ్డుపైకి వచ్చిన మురుగు



రామయ్యబౌలి గల్లీలోకి ఏరులై పారుతున్న మురుగు

అధికారుల అవగాహన లోపం..
పట్టణ ప్రజలకు శాపం

- వన్‌టౌన్ చౌరస్తాలో వరద కాల్వపైనే సుందరీకరణ పనులు
- రెండువైపులా మట్టితో పూడుకుపోయినా పట్టించుకోని అధికారులు
- వర్షాల కారణంగా మురుగు కలిసి రోడ్డుపైకి వచ్చిన తీరు
- సమీపంలోని టెలికాం కేబుల్ చాంబర్‌లోకి చేరిన వైనం



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న పట్టణవాసి నూర్‌ఖాన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో అధికారుల అవగాహన లోపం కాస్తా ప్రజల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సుమారు రెండేళ్ల క్రితం జడ్చర్ల–రాయచూర్ (ఎన్‌హెచ్–167) ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణ పరిధిలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఒకవైపు ఫుట్‌పాత్ కింద పెద్ద సైజు సిమెంట్ పైపులైన్ వేశారు. దీని గుండా వర్షాకాలంలో వరద ప్రవహిస్తుంది. కాగా, వన్‌టౌన్‌చౌరస్తా సమీపంలో స్థానిక మున్సిపల్ అధికారులు ఏడాదిన్నర క్రితం సుందరీకరణ పనులు చేపట్టారు. అయితే ఏకంగా ఫుట్‌పాత్ కింద ఉన్న వరదకాల్వపై గాంధీ రోడ్డు హైస్కూల్ నుంచి మొదలుకుని కోనాపాలమూర్ పాఠశాల వరకు వివిధ రకాల చెట్లు, ఫౌంటెయిన్‌లాన్, అందమైన రంగులతో కూడిన ఆకర్షణీయమైన డిజైన్లు ఏర్పాటు చేశారు. అప్పట్లో మట్టి మొత్తం అందులో పడినా తొలగించకపోవడంతో అది ఇరువైపులా మూసుకు పోయింది. దీంతో గత 15 రోజులుగా వర్షపునీటితో పాటు మురుగు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోయింది. ఈ క్రమంలో రోడ్డుపైకి పొంగి పొర్లి రామయ్యబౌలి గల్లీలోకి ఏరులై పారుతోంది. అలాగే సమీపంలోని టెలికాం కేబుల్ చాంబర్‌లోకి చేరింది. మరోవైపు గల్లీలోని మిషన్ భగీరథ పథకం పైపులైన్‌తో పాటు వాల్వ్ ఉండటంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆయనతో పాటు చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి తదితరులు వేర్వేరుగా పరిశీలించారు. వర్షపునీరు, మురుగు సాఫీగా ముందుకు వెళ్లేలా తగు ఏర్పాట్లు చేస్తామన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర



మాట్లాడుతున్న నరసింహ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సింగరేణిని ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలానికి పూనుకొందని సీపీఐజిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ ఆరోపించారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని సంపదను అదానీ, అంబానీ లాంటి వారికి దోచిపెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యానికి తెరలేపారని విమర్శించారు. గత పది సంవత్సరాలల్లో బీజేపీ ప్రభుత్వం రూ. ఆరులక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందన్నారు. అనంతరం తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. సురేష్, డి.రాము, అల్వాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, చాంద్‌పాషా, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీరోడ్ హైస్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో ఈ పాఠశాలను తనిఖీ చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ముందస్తుగా కమిషనర్ ఇక్కడికి వచ్చి మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

అధికారులకు ‘ప్రత్యేక’ బాధ్యతలు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆయా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరక పలు మండలాకు సంబంధించి గురువారం అధికారులు బాధ్యతలు చేపట్టారు.



మూసాపేట మండల ప్రత్యేకాధికారిగా మత్స్యశాఖ ఏడీ రాధా రోహిణి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సంతోషి, కార్యదర్శులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో ప్రత్యేక అధికారిగా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిర బాధ్యతలు తీసుకున్నారు. ఎంపీడీఓ మశ్చందర్, సూపరింటెండెంట్, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.



ఉమ్మడి గండేడ్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా సోషల్ వెల్ఫేర్ డీడీ పాండు నియమితులయ్యారు.



మిడ్జిల్ ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనురాధ, కార్యాలయ సిబ్బంది సృజన్, కిషన్‌రావు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.



కోయిల్‌కొండలో మండల ప్రత్యేకాధికారిగా మరోసారి మధుసూదన్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయనను ఎంపీడీఓ కాళప్ప, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి శాలువతో సత్కరించి స్వాగతం పలికారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మిడ్జిల్: మండలపరిధిలోని వస్పుల బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 120 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ సంపత్‌కుమార్, పారిజాత, ఆశ, లక్ష్మమ్మ, వార్డెన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా చేపట్టినందుకు డీఈఓ రవీందర్‌ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణగౌడ్, రఘురాంరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా మొదటిసారి నిర్వహించారని అన్నారు. గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి..



కోయిల్‌కొండ: మండలంలోని అభంగపట్నం ఎంపీటీసీ సభ్యురాలు చింతకింది పద్మమ్మ పదవీ కాలం ముగియడంతో గురువారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామంలోని ప్రజలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీయూలో విద్యార్థి దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి దినోత్సవం నిర్వహించారు. ఈమేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు క్యాంపస్‌లో ఉన్న వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని వ్యక్తిగత, వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, ఏబీవీపీ నాయకులు అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి నిర్మూలనకు, దోపిడీదొంగలకు వ్యతిరేకంగా తన పోరాట పటిమను చాటిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. అప్పట్లోనే ప్రజలను ఏకం చేసి నిజాం, రజాకార్లను తరిమికొట్టేందుకు ఉద్యమించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం కౌన్సిలర్ సాదతుల్లా, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐలు ఎన్.నర్సింహులు, రమేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ సిద్దీఖీ, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, పాపారాయుడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల జీతాలు విడుదల చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు, పంచాయతీ అధికారి కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో 441 గ్రామ పంచాయతీల్లో 18 వందల మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. 12 నెలల నుంచి జీతాలు రాకపోవడంతో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. పెరిగిన ధరలతో ఏమీ కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. జీవనం కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. మేజర్ పంచాయతీల్లో నిధులు ఉన్నా ప్రభుత్వ నిబంధనల వల్ల జీతాలు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నారాయణ, శివరాములు, వెంకటయ్య, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం



సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకద్రలో బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల కాలంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ స్వర్ణయుగంగా మారిందన్నారు. ప్రజలు ఊహించిన దానికి కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఏడు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రైతుబంధు రాక చాలమంది ఇబ్బందుల పాలయ్యారని విమర్శించారు. రైతు సంక్షేమం ఒక్క బీఆర్ఎస్ వల్లనే సాధ్యం అయిందని అన్నారు. వానాకాలం ప్రారంభం అయి నెల గడుస్తున్నా రైతుబంధు రాలేదని అన్నారు. రుణమాఫీకి కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయలేక పోతున్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి, హన్మిరెడ్డి, రాధాకృష్ణ, ఆంజనేయులు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధంకండి



మాట్లాడుతున్న సీఈఓ రాఘవేందర్‌రావు

గండేడ్: వనమహోత్సవానికి సర్వంసిద్ధం చేసుకోవాలని జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఎంపీడీఓ దేవన్నను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం పరిసరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రత్యేకంగా వనమహోత్సవం నిర్వహిస్తామని అప్పటిలోగా గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ డీడీ పాండు, ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

కురుమూర్తిలో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: అమ్మపురం సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి ప్రధాన ఆలయం వరకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ప్రధాన ఆలయానికి వాహనాల ద్వారా చేరుకునే భక్తులకు ఏరకంగా సౌకర్యవంతంగా ఉంటుందో.. అందుకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సి. కృష్ణయ్య, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దామోదర్, బాల్‌రాజు, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను అపహాస్యం చేసే విధంగా వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు వ్యవహరించినట్లు వివరించారు. స్పౌజ్‌ను దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా అధికారుల విచారణలో తేలినప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇతర జిల్లాల్లో ఇలాంటి వారిపై చర్యలు తీసుకున్నారని, ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే చర్యలు తీసుకోలేదన్నారు.

టూటౌన్ సీఐగా ఎండీ ఇజాజుద్దీన్



మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ టూటౌన్ సీఐగా ఎండీ ఇజాజుద్దీన్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న సీఐ డి.స్వామిగౌడ్ సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ నూతన చట్టాలను చాలా పటిష్టంగా అమలు పరిచేవిధంగా.. నేరాలకు తగిన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెడుతామన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జర్నలిస్టు వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని టీడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దండుదత్తేంద్ర అన్నారు. గురువారం టీఎన్‌జీఓ భవన్‌లో యూనియన్ సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల పంపిణీలో గందర గోళం చోటుచేసుకుందని... పట్టాల అందజేతలో జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్నారు. 25 సంవత్సరాలుగా వృత్తిలో ఉన్న వారికి సైతం లబ్ధి చేకూరలేదన్నారు. తమ యూనియన్ తరపున ప్రతి ఒక్క జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులను గుర్తించి ముందుగా ప్రభుత్వం నుంచి వారికి పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు సాగర్‌రెడ్డి, రవీందర్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశ్, వెంకటయ్య, మణిప్రసాద్, సతీష్‌కుమార్, నానిసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి



మిడ్జిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం బంద్ నిర్వహించారు. నీట్ విషయంలో సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని నాయకులు అన్నారు. అదేవిధంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈసందర్భంగా పేర్కొన్నారు.

- నవాబుపేట పరిధిలో ఎస్ఎస్‌యూఐ జడ్చర్ల నియోజకవర్గం కార్యదర్శి సలావుద్దీన్, మండల అధ్యక్షుడు సాజిద్ ఆధ్వర్యంలో విద్యా సంస్థలు బంద్ చేయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.
- మిడ్జిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు శ్రీశైలం, సల్మాన్, నరేష్, శ్రీకాంత్, వేణు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.
- దేవరకద్ర మండలంలో గురువారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. విద్యాసంస్థలను బంద్ చేయించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రవి ప్రసాద్, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్ పరిధిలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు కేశవులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.